1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | అక్టోబర్ 12, 2024 | www.navatelangana.com

## రాష్ట్రస్థాయి పోటీల్లో మెరిసిన విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూడు రోజులుగా రంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న 53వ సీనియర్ పురుషుల మహిళల రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ మహిళల జట్టు కాంస్య పథకాన్ని సాధించారని ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యామ్‌సుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ తెలిపారు. జట్టుకు కెప్టెన్ రమ్య, కోచ్ అరవింద్, కళ్యాణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభ కనబరిచిన జిల్లా జట్టును జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి, ఏసిఎంవో ఉద్ధవ్‌తో పాటు పలువురు అభినందించారు.



## 20క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రభుత్వం సరఫరా చేస్తున్న పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలుతోందనే పక్క సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామని ఎస్సై తిరుపతి, డిప్యూటీ తహశీల్దార్ రామారావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం 20క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించేందుకు బొలెరో మాక్స్‌లో తరలించేందుకు సిద్ధంగా ఉండగా పట్టుకున్నారు. బియ్యంతో పాటు బొలెరో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితునిపై పిడిఎస్ యాక్ట్ ప్రకారం 6ఏ కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర ప్రభుత్వ ఉపాధి పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథక రుణ సాయంతో బాయిలర్ కోళ్ల ఫామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాలలో వ్యాపారం చేయాలనుకునే వారికి 35 శాతం వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు. గరిష్టంగా రూ.20లక్షల సబ్సిడీ పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన కోళ్ల ఫారానికి రూ.20లక్షల రుణం మంజూరు చేయబడిందని పేర్కొన్నారు. అర్హులైన వాళ్లందరూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్‌గోపాల్, జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్ నర్సింహారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్ పాల్గొన్నారు.

## పేకాట ఆడుతూ పట్టుబడిన లారీ డ్రైవర్లు



నవతెలంగాణ-మందమర్రి

పేకాట ఆడుతున్న లారీ డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం సాయంత్రం చెత్లాపూర్ తోటలో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో రైడ్ చేసి ఐదుగురు లారీ డ్రైవర్లను పట్టుకున్నారు. వారి నుండి రూ.15,720 నగదు, 5 మొబైల్ ఫోన్లు, 3 బైకులు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో నీరటి శ్రీశైల, పులి బాలయ్య, కప్ప నర్సయ్య, బబ్బెర విజయ్, రత్నం వెంకటస్వామి ఉన్నారు. వీరందరూ మందమర్రికి చెందిన లారీ డ్రైవర్లు. దాడిలో కానిస్టేబుల్స్ గోపాల్, సురేందర్, సంపత్ ఉన్నారు.

## కుమురం భీం చరిత్రపై డాక్యుమెంటరీ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసుల పోరుబిడ్డ కుమురం భీం జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ షూటింగ్ సమక్క గ్రామ శివారులో శుక్రవారం నిర్వహించారు. ఆనాడు ఆదివాసులు ఎదుర్కొంటున్న జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాం సర్కారుతో పోరాడి అమరుడైన భీం చరిత్రపై ఈ డాక్యుమెంటరీ షూటింగ్ తీస్తున్నట్లు డైరెక్టర్ జానిఫర్ తెలిపారు. మండలంలో రెండు రోజుల పాటు షూటింగ్ ఉంటుందని, ఈ నెల 17న కుమురం భీం వర్ధంతి రోజున ఐటీడీఏ పీఓ సమక్షంలో డాక్యుమెంటరీ ప్రదర్శిస్తామని డైరెక్టర్‌తో పాటు కొరియోగ్రాఫర్ రాజశేఖర్, కెమెరామెన్ రాజశేఖర్ తెలిపారు.

## యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలి



నవతెలంగాణ-కడెం

యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో కొప్పుల నరేష్ ఆధ్వర్యంలో సారంగాపూర్ గ్రామంలో ఐదు గ్రామాల స్థాయి వాలీబాల్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ క్రీడలో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి ప్రతి ఒక్క క్రీడాకారుడు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని టీఆర్ఎస్వీ మాజీ పశ్చిమ జిల్లా విభాగం అధ్యక్షులు అచ్యుతరెడ్డి అన్నారు. క్రీడా పోటీల్లో గెలుపు ఓటములను క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలని సారంగాపూర్ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలగడప ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, కొప్పుల నవీన్, కోల నరేష్, మోతె నాగరాజ్, వంగ రాజన్న, కొప్పుల నగేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆధార్ అనుసంధాన పోస్ట్ ఆఫీస్, బ్యాంకు ఖాతాలు తెరవండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులు ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాలు, పోస్ట్ ఆఫీస్ ఖాతాలు తెరవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టల్ విభాగం కొత్తగా ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ పేరుతో బ్యాంకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని, దీంతో అనేక రకాల సౌకర్యాలు విద్యార్థులకు కలుగుతాయని తెలిపారు. వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

# తడి లేదు..పొడి లేదు..!

- చెత్త సేకరిస్తున్నా..కనిపించని ఎరువుల తయారీ
- అనేక పల్లెల్లో వృథాగా డంపింగ్‌యార్డులు
- నెరవేరని అసలు లక్ష్యం.. రూ.లక్షల నిధులు వృథా

ఇంటి నుంచి బయటపడేసే చెత్తను వృథాగా వదిలేయకుండా..దీనిని సైతం సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం భావించింది. తడి, పొడి చెత్తను సేకరించి నిల్వ చేసేందుకు ప్రతి పల్లెలో డంపింగ్‌యార్డులు నిర్మించింది. నిర్మాణ ప్రారంభంలో కొంత హడావుడి కనిపించినా..తదనంతరం వీటిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్‌యార్డులు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. కార్మికులు రోజువారీగా చెత్తను సేకరిస్తున్నా డంపింగ్‌యార్డుకు చేర్చడం లేదని తెలుస్తోంది. పొడి చెత్తను ఊరి చివర నిర్మాణుష్య ప్రదేశంలో పడేసి కాల్చేస్తున్నారు. ఫలితంగా చెత్తను సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యం నెరవేరడం లేదు. అధికారులు సైతం అంతగా దృష్టిసారించకపోవడం మూలంగా అనేక గ్రామాల్లో డంపింగ్‌యార్డులు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రతి ఇంటి నుంచి చెత్తను రెండు రకాలుగా సేకరించి ఎరువుల తయారీతో పాటు పొడి చెత్తను విక్రయించడం ద్వారా పల్లెలకు లాభాలు సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డంపింగ్‌యార్డులను నిర్మించింది. చెత్త సేకరణకు ప్రతి గ్రామానికి ట్రాక్టర్‌ను సమకూర్చడంతో పాటు మల్టిపర్పస్ వర్కర్లను నియమించింది. రోజువారీగా ప్రతి ఇంటి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు చేరుస్తున్నారు. డంపింగ్‌యార్డు వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి తడి చెత్తను నిల్వ చేసి ఎరువులు తయారుచేయడం, పొడి చెత్తలో లభించే ఇనుము, ప్లాస్టిక్ తదితర వస్తువులను విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చాల్సి ఉంటుంది. తయారైన ఎరువును ఇతరులకు విక్రయించడం లేదంటే హరితహారం మొక్కలకు వినియోగించాల్సి ఉంటుంది. డంపింగ్‌యార్డులు నిర్మించిన తొలినాళ్లలో చెత్త నుంచి ఎరువులను తయారుచేసిన సిబ్బంది తదనంతరం వివిధ కారణాలతో విడిచిపెట్టారు. పొడి చెత్తను సైతం గ్రామానికి చివరన వివిధ ప్రాంతాల్లో పడేసి కాల్చేస్తున్నారు. గ్రామాల్లో సేకరిస్తున్న చెత్త తగినంత రాకపోవడంతో ఎరువుల తయారీకి ఆటంకం కలగడంతో పాటు పొడి చెత్తతోనూ అంతగా లాభం లేదనే భావనతో ఉన్నట్లు తెలుస్తోంది. పెద్ద గ్రామాల్లో తడి చెత్తతో ఎరువుల తయారీ చేపడుతుండగా.. చిన్న పల్లెల్లో మాత్రం సాధ్యం కావడం లేదని కొందరు పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

**రూ.లక్షల నిర్మాణాలు వృథా..!**

ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతి పల్లెలో డంపింగ్‌యార్డుల నిర్మాణం చేపట్టింది. ఒక్కో డంపింగ్‌యార్డు రూ.2లక్షలతో ఉమ్మడి జిల్లాలో 1512 నిర్మాణాలు చేపట్టింది. కానీ నిర్మించి వదిలేయడంతో ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ డంపింగ్‌యార్డులు పనికిరాకుండా పోతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులు సైతం వృథాగా మారాయి. మరోపక్క కార్మికులకు అదనపు పనిభారం కావడం.. అప్పటికే రోడ్లు, మురుగుకాల్వలు శుభ్రం చేయడంతో పాటు హరితహారం మొక్కలకు నీళ్లుపట్టించటం వంటి అనేక పనులు చేపడుతున్నారు. వీటికి తోడు చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించే వరకు మధ్యాహ్నం సమయం అవుతోంది. చిన్న గ్రామాల్లో ఎరువులు తయారుచేసేంత చెత్త కూడా లభించడం లేదని చెబుతున్నారు. చెత్తతో ఎరువులు తయారుచేస్తే కనీసం హరితహారం మొక్కలకైనా వేసేందుకు అవకాశం లభిస్తుంది. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం.. పంచాయతీ కార్యదర్శులు సైతం అంతగా దృష్టిసారించకపోవడం మూలంగా ఎరువుల తయారీ లక్ష్యం నెరవేరడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి చెత్తను వృథాగా పోనియకుండా సద్వినియోగం చేసేలా చర్యలు తీసుకుంటే పల్లెలకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




**వినియోగంలోకి తీసుకొచ్చేలా కృషి :**

**శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్**



జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఎరువులు తయారుచేసేంత తడి చెత్త రావడం లేదని చెబుతున్నారు. పెద్ద పంచాయతీల్లో చెత్తను వేర్వేరు చేసి తడి చెత్తతో ఎరువుల తయారీ జరుగుతోంది. చిన్న వాటిలోనే సమస్య ఉంది. గ్రామాల్లో పర్యటించిన సందర్భాల్లో చెత్తను సద్వినియోగం చేసుకోవాలని చెబుతున్నాం. నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నాం. మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చేలా కృషిచేస్తాం.

## ఘనంగా 'ఉజ్వల సింగరేణికి ఉద్యోగుల పాత్ర'



నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ గనిపై ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎస్‌వో-2 జీఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కలిసి సింగరేణి సంస్థ భవిష్యత్తులో నిర్వహించబోయే నూతన విధానాలపై ఉద్యోగులందరికీ అవగాహన కల్పించేందుకు బొగ్గు గనులపై ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర అనే కార్యక్రమన్ని నిర్వహించామన్నారు. ఉద్యోగులకు, ఒప్పంద కార్మికులందరికి సహపంక్తి భోజనాలు నిర్వహించాలని చాలా చక్కటి కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అదే విధంగా ఉద్యోగులందరికీ సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, సింగరేణిలో వాడుకలో ఉన్న మిషనరీ పని తీరు, ఉత్పత్తి వ్యయం, కంపెనీ భవిష్యత్తు, ప్రణాళికలు, కార్మికులకు సంస్థ అందించే సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కార్యాచరణ రూపొందించడం, నూతన గనులు, థర్మల్, సోలార్ విద్యుత్, పవర్ ప్లాంట్, ఇతర వ్యాపార విస్తరణ అంశాలపై ఉద్యోగులకు, పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. ఉద్యోగులకు, ఒప్పంద కార్మికులకు సంపక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, సిఎంఓఏఐ ఏరియా సెక్రటరీ పైడిశ్వర్, గని మేనేజర్ శంకరయ్య, గని ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యతో ఏదైనా సాధ్యమే : ఎమ్మెల్యే వివేక్

నవతెలంగాణ-జైపూర్

విద్యతో ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం చెన్నూరు మండలం సోమనపల్లిలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలెడ్జ్ ఈస్ మోస్ట్ ఇంపార్టెంట్ అని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, స్వామి వివేకానంద అన్నారని గుర్తు చేశారు. నియోజకవర్గ పరిధిలో గురుకుల పాఠశాలల నిర్మాణాలు అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కతో పట్టుబట్టానని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లిస్టులో చెన్నూరు పేరు లేదని గుర్తు చేశారు. నియోజకవర్గంలో నీటి ఎద్దడి నివారణకు 100 బోరు బావులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.100కోట్లతో చేపట్టిన అమృత స్కీం ద్వారా చెన్నూరులో ఇబ్బందులు తీరిపోతాయని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని, ఇప్పటికే పదివేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. సోమనపల్లిలో ఏర్పాటు చేస్తున్న సమీకృత గురుకుల పాఠశాల ద్వారా స్థానికులతో పాటు పరిసర గ్రామాల వారికి విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.



## సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది




నవతెలంగాణ-మందమర్రి

సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశానుసారం శుక్రవారం ఏరియాలోని గనులు, డిపార్ట్మెంట్లలో ఉజ్వల సింగరేణి - ఉద్యోగుల పాత్రపై సమావేశం నిర్వహించారు. అనంతరం ఉద్యోగులందరికీ విందు ఏర్పాటు చేశారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ కంపెనీకి సంబంధించిన ఆర్థిక స్థితిగతులను ఉద్యోగులకు వివరించారు. రానున్న పోటీ మార్కెట్‌లో నిలబడాలంటే సింగరేణి కార్మికులు యంత్రాలను పూర్తి సమయం వినియోగించాల్సిన అవసరం ఉందని, లేదంటే సంస్థ మనుగడ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ప్రతి విషయాన్ని వాస్తవాలన్నింటినీ కార్మికులకు వెల్లడిస్తున్నామన్నారు. 8గంటల డ్యూటీ సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని, యంత్రాలను వినియోగిస్తూ ఉత్పాదకత పెంచాలని కోరారు. కంపెనీని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులు, అధికారులపైనే ఉందన్నారు. కష్టపడటానికి కార్మికులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని, వారిని నడిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధిస్తూ సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు సాంబశివరెడ్డి, సీఎంఓఏఐ అధికారి రవి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, జీఎం కార్యాలయం ఉన్నతాధికారులు, సిబ్బంది, సివిల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## రావణసుర దహనం మానుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

రావణసురుని దహనం చేయడం మానుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి అర్క గోవింద్‌రావ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కుమురం భీం విగ్రహం వద్ద మాట్లాడారు. రావణసురుని దహనం చేయొద్దని ప్రభుత్వానికి, నాయకులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల ఆరాధ్య దైవం లంక మహారాజు అయిన రావణసురుడిని చేయని తప్పుకు శిక్షగా యావత్ ఆదివాసీ సమాజాన్ని చులకనగా చూస్తూ దహనం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. నిజాలు తెలుసుకోకుండా రావణసురుడిని రాక్షసునిగా అభివర్ణిస్తున్నారని, ఆయన మాట మీద నిలబడే మహారాజు అని, నేటి సమాజం చులకనగా చూడడం మానుకోవాలని పేర్కొన్నారు. ఆదివాసుల మనసుకు గాయం చేయాలని చూడొద్దని హెచ్చరించారు. ఆయన వెంట ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావ్, మండల అధ్యక్షులు పూసం ఇస్రు, ప్రధాన కార్యదర్శి అర్క గోవింద్‌రావ్, సెడ్మకి వినోద్, హీరాలాల్, పూసం భావ్‌రావ్ పాల్గొన్నారు.

## కుంరం సూరు వర్ధంతి వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



నవతెలంగాణ-కెరమెరి

కుంరం సూరు 27వ వర్ధంతి వాల్‌పోస్టర్లను శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సూరు మనుమడు కుంరం పాండు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న గిరిజన అమరుడు కుంరం భీం అసువులు బాసిన పొరుగడ్డ జోడేఘాట్‌లో భీం వర్ధంతితో పాటు సూరు వర్ధంతిని అధికారికారంగా నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిమ జాతి కొలాం తెగల ప్రజలు, మేధావులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూరు ఉత్సవ కమిటీ చైర్మన్ మడావి రాజు, కన్వీనర్ మారుతి, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్, నాయకులు కనక ప్రభాకర్, సిడాం ధర్ము ఆత్రం రాజు, టేకం మాన్కు, టేకం భీంరావు పాల్గొన్నారు.

## పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

**ఆసిఫాబాద్ :** ఈ నెల 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా జిల్లాలోని యువతకు, ఫోటోగ్రాఫర్లకు నిర్వహించే వివిధ రకాల పోలీస్ సంబంధిత అంశాలపై పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ డివి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షార్ట్ ఫిలిం చేయాలనుకునేవారు ఈ నెల 24 లోపు మూడు నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలిం సిద్ధం చేసి దగ్గరలోని పోలీస్‌స్టేషన్లలో ఇవ్వాలని తెలిపారు. ఇతర వివరాల కోసం స్థానిక పోలీస్‌స్టేషన్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నవతెలంగాణ-నేరడిగొండ**

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈఓ పవార్ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలో కుప్టి గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి



వ్యాధులతో బాధ పడుతున్న వారికి వైద్యమందించారు. అవసరమున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ పవార్ రవీందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరా పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

**నవతెలంగాణ-ఉట్నూర్**

నార్నూర్ మండలం మరపగూడ గ్రామానికి చెందిన పూసం అశోక్ టీఆర్ఆర్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విద్యార్థిని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో



గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలని అన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని కసి పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరించాలన్నారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దిగుబడి రాకపాయే.. ధర పెరిగే..

- టమాటా పంటపై తెగుళ్లు
- భారీ వర్షాలే కారణం
- క్యారట్ ధర రూ.వెయ్యి



**నవతెలంగాణ-ఇంద్రవెల్లి**

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీ వర్షాల వల్ల టమాటా పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు పలు రాష్ట్రాలకు ఎగుమతి అయిన టమాటా ప్రస్తుతం మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉన్న తెగుళ్ల వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని రైతన్న ఆందోళన చెందుతున్నాడు. ఒకప్పుడు టమాటా పంటకు పేరుగాంచిన మండలంలోని ధనోర గ్రామం ప్రస్తుతం పంట సరిగ్గా రాక దిగాలు చెందుతున్నాడు. గత ముప్పై ఏండ్ల నుంచి ఇక్కడి రైతులు టమాటా పంటతో పాటు వివిధ రకాల కూరగాయలను సాగుచేస్తున్నారు. ఇక్కడ పండించిన పంటను పక్క జిల్లాలైన కరీంనగర్‌తో పాటు పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలోని చంద్రపూర్, నాగ్‌పూర్, గొందియా, ఇతర రాష్ట్రాలైన యూపీ, ఎంపీ తదితర రాష్ట్రాలకు ఇక్కడి టమాటా మార్కెట్‌కు తరలించేవారు. దీంతో మన రైతులు ఆర్థికంగా బల పడటంతో పాటు గ్రామీణ ప్రాంతంలో కూలీలకు ఉపాధి కల్పించే వారు. వందల ఎకరాల్లో సాగు చేసే ఈ పంటకు గత నాలుగైదు ఎండ్ల నుంచి నష్టాలను కలిగించడంతో రైతులు దీని సాగును క్రమ క్రమంగా తగ్గిస్తున్నారు. ప్రస్తుత 2024-25 ఖరీఫ్‌లో కేవలం 49 ఎకరాల్లో మాత్రమే ఈ పంటను సాగుచేస్తున్న రంటే దీనిని సాగు ఎంత మేరకు తగ్గిందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని గుడిహత్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో ఈ పంటను అత్యధికంగా సాగు చేసేవారు. ప్రతి ఏటా తెగుళ్ల సోకడం దిగుబడి రాకా, పెట్టిన పెట్టుబడి రాక పోవడంతో ఈ పంట సాగు రాను రాను తగ్గిపోతోంది.

**ధర ఉన్న ఏం లాభం...**

ప్రస్తుత ఖరీఫ్‌లో క్యారట్ (30) కిలోల టమాట ధర రూ.700 నుంచి రూ.1000 వరకు పలుకుతోంది. ధర బాగానే ఉన్న వాతావరణ మార్పులు, భారీ వర్షాల వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. మరోవైపు కాస్త ఉన్న పంటకు తెగుళ్ల సోకడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిందని రైతులు పేర్కొంటున్నారు. మన ఉమ్మడి రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా, మదనపల్లి, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్, కర్నాటకలోని గుత్తిలో అధికంగా పండించే ఈ పంట అతివృష్టి వల్ల దిగుబడి తగ్గి పోవడంతో ధరలు పెరిగిపోయాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ధరలు నెల రోజుల పాటు ఇలాగే ఉండే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

**రైతులకు సలహాలు సూచనలు కరువు...**

రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు తెగుళ్ళు సోకినప్పుడు ఎప్పటి కప్పుడు సలహాలు సూచనలు ఇవ్వవలసిన ఉద్యాన వన శాఖ పట్టించుకోవడం లేదని.రైతులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు కుక్క గొడుగుల్ల వెలసిన నర్సరీ లో టమాటా నారును కొనుగోలు చేస్తున్నారు. నర్సరీ నిర్వాహకులు నాసి రకం నారును అమ్ముతూ.. రైతులను నట్టేట ముంచుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### టమాటా విత్తనాలను ప్రభుత్వమే అందించాలి



నాణ్యమైన టమాటా విత్తనాలను రాయితీపై ప్రభుత్వం ఉద్యాన వన శాఖ ద్వారా రైతులకు అందించాలి. నర్సరీలపై కొరడా ఝులిపించాలి. ఉద్యాన వన శాఖ ద్వారా ధృవీకరించిన విత్తనాలనే నర్సరీలో అందుబాటులో ఉంచాలి. నర్సరీలో నారు తీసుకొనే రైతులకు తప్పని సరిగా రసీదు ఇవ్వాలి.

**జాయేభాయే సుభాష్, రైతు, శంకర్ గూడ**





## వివిధ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సన్మానం



**నవతెలంగాణ-తాంసి**

ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో తాంసి మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన ఏలేటి జ్ఞాన ప్రగతి, గంగాసాగర్, అశ్వక్, శైనిలు తమ సత్తాను చాటి టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అదే విధంగా సుంక వంశీ, పొగుల శివ అగ్నిపథ్‌కు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక గ్రంథాలయ కమిటీ, ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వారిని, వారి తల్లిదండ్రులను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన వారు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు, ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీహరిరావుని కలిసిన నూతన మార్కెట్ కమిటీ చైర్మెన్లు



**నవతెలంగాణ-నిర్మల్‌రూరల్**

ఇటీవల నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మెన్‌లుగా నియమితులైన నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ భీమ్‌రెడ్డి, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ హదీలు నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు వారికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

## భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆరాధన

- అమ్మవారికి జోగు దంపతుల ప్రత్యేక పూజలు



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకుంటూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని భక్తి శ్రద్ధల నడుమ ఆరాదిస్తున్నారని, సనాతన ధర్మంలోని పండగల ప్రాశస్త్యాన్ని భావితరాలకు తెలియచెప్పేలా వేడుకలను జరుపుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని శాంతి నగర్, కోలిపురలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపం వద్ద జోగు సతీమణి రమాదేవితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు మహాన్నాదానం ఏర్పాటు చేశారు. వేదపండితుల సమక్షంలో పూజలు చేసి అమ్మవారిని కొలిచారు. పండగల విశిష్టతను భావితరాలకు తెలియజేపుతూ పండగలను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఆయన వెంట విజ్జగిరి నారాయణ, రాజన్న, బట్టు సతీష్, నవతె శ్రీనివాస్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

**ఆదిలాబాద్‌రూరల్ :** ఆదిలాబాద్, మావల మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాదేవి మండపం వద్ద శుక్రవారం హోమం నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు మహాన్నదానం ఏర్పాటు చేశారు. వేద పండితుల సమక్షంలో కాలనీవాసులు పూజలు చేసి అమ్మవారిని కొలిచారు.

# కొత్త మైసంపేట గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**నవతెలంగాణ-కడెం**

కొత్త మైసంపేట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మైసంపేట గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైసంపేట గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. టైగర్ జోన్ పరిధిలో మైసంపేట గ్రామం రావడంతో గ్రామాన్ని తరిలించడం జరిగిందన్నారు. అటవీశాఖ అధికారులు మైసంపేట గ్రామస్తులకు 5 ఎకరాల భూమి త్వరగా మంజూరు అయ్యేలా కృషి చేయాలనీ ఆదేశించారు. ఇప్పటికి గ్రామంలో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నాయకులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, కడెం పట్టణాధ్యక్షులు వాజీద్ ఖాన్, సింగల్ విండో డైరెక్టర్‌లు గొల్ల వెంకటేష్, పడిగెల భూషణ్, నిర్మల్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దుర్గభవాని, ఖానాపూర్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకాల శ్రీనివాస్, మండల మైనార్టీ అధ్యక్షులు బబ్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, రహీం, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాటమయ్య రక్ష సేఫ్టీ కిట్స్ పంపిణీ



**నవతెలంగాణ-నిర్మల్‌రూరల్**

నిర్మల్ నియోజకవర్గానికి చెందిన పలువురు శిక్షణ పూర్తి చేసుకున్న గౌడ కుల సభ్యులకు కాటమయ్యా రక్ష సేఫ్టీ కిట్స్‌ను బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు, గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రైతు బిడ్డకు ఉద్యోగం రావడం గొప్ప విషయం

**నవతెలంగాణ-తాంసి**

రైతు కుటుంబానికి చెందిన రైతుబిడ్డ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఎంతో గొప్ప విషయమని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గిరిగామ గ్రామానికి చెందిన సాయికృష్ణతో పాటు మండలంలోని భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన మస్కరి చంద్రకాంత్ ప్రభుత్వ ఉపాధ్యాయు ఉద్యోగం సాధించగా, వారిని పూలమాలతో సన్మానించారు. అనంతరం ఆయా గ్రామాలలో ప్రతిష్ఠించిన దుర్గామాత, శారదదేవి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిప్పల్‌కోటి గ్రామంలో గత 25 సంవత్సరాలుగా గ్రామస్తులందరూ కలిసి కుల మతాలకు అతీతంగా ఎంతో భక్తిశ్రద్ధలతో దుర్గామాతను ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు. ఒక రైతు కుటుంబంలో తన బిడ్డ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సంతోష తగ్గ విషయం అన్నారు. ఎటువంటి కోచింగ్ లేకుండా ఉద్యోగం సాధించడం గొప్ప విషయమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాదాపు 35వేల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ధనుంజయ్, లస్మన్న, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, అరిఫ్, అఫ్రోజ్ ఉన్నారు.



## మెస్రం మనోహర్‌కు సన్మానం



**నవతెలంగాణ-ఉట్నూర్**

ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవీటీజీ ఏపీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మెస్రం మనోహర్‌ను మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షులు ఎర్రదండి సునీల్ కుమార్ ఎస్సీ, ఎస్టీ యాక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కాటం రమేష్‌లు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సలీముద్దీన్, తౌటి ఆశన్న, దుర్గ పటేల్, పురుషోత్తం, శ్రీకాంత్ కేంద్రే రమేష్, హనుమంతరావు పాల్గొన్నారు.

## ఉద్యోగం సాధించిన మాధవికి సన్మానం



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ఆదిలాబాద్ సహా తైక్వాండో క్లబ్ కోశాధికారి కన్య మాధవి ఇటీవల డీఎస్సీ జాబితాలో పీఈటీగా ఉద్యోగం సాధించింది. ఈ నేపథ్యంలో క్లబ్ ఆధ్వర్యంలో ఆమెను ఆమె నివాసంలో ఘనంగా సన్మానించారు. ముందుగా కేక్ కట్ చేసి తినిపించి, శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్సీ ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించి పీఈటీగా ఎన్నికైందన్నారు. గత ఏడు సంవత్సరాలుగా తైక్వాండో నేర్చుకుంటూ డిగ్రీ పూర్తి చేసుకొని, నూతనంగా వచ్చిన ఫలితాల్లో ప్రతిభ కనబర్చిందని అధ్యక్షులు శివప్రసాద్, జనరల్ సెక్రటరీ వీరేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శృతి అసోసియేషన్ సభ్యులు టి అజయ్ కుమార్, ఆర్ దివ్య వనిత రాథోడ్ పాల్గొన్నారు.

## అడెల్లిలో ఉచిత వైద్య శిబిరం



**నవతెలంగాణ-సారంగాపూర్**

మండలంలోని అడెల్లి గ్రామంలో శుక్రవారం నిజామాబాద్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు భార్గవ్, రేణుకలు 94 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి రవి, గ్రామ ఆర్ఎంపీ సాయన్న, గ్రామస్తులు, యువకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ కాలనీల అభివృద్ధి రూ.10.50 కోట్లు

- పనుల కోసం టెండర్లు ఆహ్వానం



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

పట్టణంలోని ఆయా కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువల కోసం మున్సిపల్ తరపున ప్రభుత్వానికి రూ.50కోట్ల ప్రతిపాదనలు పంపించారు. తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌళిక వసతుల కల్పన అభివృద్ధి పథకం కింద అందిన ప్రతిపాదనల్లో ప్రభుత్వం తొలివిడతలో రూ.10.50 కోట్ల పనులకు అనుమతిస్తూ నిధులను విడుదల చేసింది. అయితే ఇందులో పట్టణంలోని ఆయా కాలనీల్లో ఉన్న సమస్యలను గుర్తించిన అధికారులు పనుల కోసం టెండర్ ను ఆహ్వానించనున్నారు.

ఏడాది కింద రూ.46 కోట్ల 70 లక్షలతో 49 పనులకు ఆమోదం లభించింది. ఎన్నికలు రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. తాజాగా ప్రభుత్వం మారడంతో స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ సూచన మేరకు పాత ప్రతిపాధనలకు కొంత సవరణలు చేసి పంపించారు. తొలి విడతలో రూ.పది కోట్ల 50 లక్షల పనులకు అమోదం వచ్చింది. దీంతో వీలిన వార్డుల్లో కూడా ఇక సీసీ, బీటీ రోడ్లతో పాటు మురుగు కాలువల నిర్మాణాలు కానున్నాయి.

### దశల వారీగా పనులు చేపడుతాం

టీయూఎఫ్డీసీ పథకం కింద మున్సిపల్‌కు రూ.10.50కోట్ల పనులకు ఆమోదం వచ్చింది. ఇప్పటికే పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ఇందులో వీలిన వార్డులతో పాటు అత్యవసరంగా ఉన్న వార్డులను గుర్తించాము. మిగత నిధులు వచ్చిన తరువాత దశల వారీగా ఆయా కాలనీల్లో కూడా ప్రాధాన్య క్రమంలో పనులు చేపడుతాం.



**ఖమర్ అహ్మద్ మున్సిపల్ కమిషనర్**

## ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

2024-25 విద్యాసంవత్సరంలో ఉపకార వేతనాల మంజూరు కోసం ఈ పాస్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదిలాబాద్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు రెన్యూవల్‌తో పాటు కొత్తగా చేసుకునేవారు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థి పేరు ఎసెస్సీ మెమోలో ఉన్న విధంగా ఆధార్ కార్డులో ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థుల ఆదాయ పరిమితి రూ.2 లక్షల నుంచి రూ 2.50 లక్షల వరకు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

## ఓపెన్ డిగ్రీ, పీజీ ప్రవేశాలకు దరఖాస్తులు

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యలో డిగ్రీ, పీజీ, డిప్లొమా ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 30వ తేదీతో దరఖాస్తుల గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో అధికారులు గడువు పెంచుతూ ఇటీవల ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 15వ తేదీ వరకు అప్లయ్ చేసుకోవచ్చుని ఆయా కళాశాలల నిర్వాహకులు పేర్కొన్నారు. ఎస్‌డీఎల్‌సీఈకేయూ.కో.ఇన్ వెబ్ సైట్‌లో పూర్తి వివరాలను తెలుసుకోవచ్చుని సూచించారు. ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నవరాత్రి ఉత్సవాల్లో డీఎం ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో దుర్గాదేవికి డీఎం విశ్వనాథ్ దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో పరిధిలో పనిచేస్తున్న



కార్మికులకు ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలపడంతో పాటు డిపో ఆవరణలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్టీఐ సరియ, ఎంఎఫ్ ఉదయ్, టిఐ3 భారతి, హెడ్‌కానిస్టేబుల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి వడై శ్రీరామ్‌కు శుక్రవారం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయన ఇటీవలే ట్రైనింగ్ పూర్తి చేసుకొని స్వగ్రామానికి రావడంతో గ్రామస్తులు స్వాగతం పలికారు. ఉద్యోగం సాధించి దేశ సేవలో ఉండడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గౌరయ్య, బాపురావు, హన్మంతు పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిపోలోని ఆర్టీసీ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో డీఎం రోజురోజుకు కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. దసరా పండుగ రోజు ఆర్టీసీ కార్మికులకు టీమ్ డ్రైవర్లకు, ఇతర కార్మికులకు డ్యూటీలు సద్దుబాటు చేసి ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు ఇలా చేయకుండా తమకు నచ్చిన వాళ్లకు నచ్చిన విధంగా డ్యూటీలు వేస్తూ నచ్చని వాళ్లను భయభ్రాంతులకు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని లేని పక్షంలో సంఘం తరపున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


## పేద కుటుంబానికి పెద్ద దిక్కయ్యాడు



నవతెలంగాణ-కౌటాల

పేద కుటుంబానికి చంద్రశేఖర్ పెద్ద దిక్కయ్యాడని మాజీ ఉపసర్పంచ్ గోంగ్లె సాయినాథ్ అన్నారు. మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన ప్రభాకర్-సువర్ణ దంపతుల కుమారుడు సత్పుతి చంద్రశేఖర్ ఇటీవల డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయునిగా ఎంపికయ్యాడు. శుక్రవారం గ్రామస్తులతో కలిసి సన్మానించారు. పేదరికంలో ఉన్న కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం రావడం చాలా సంతోషకరమని తెలిపారు.

## దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే దసరా వేడుకలకు సర్వం సిద్ధమైంది. దసరా ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ఐదు గంటలకు అభయాంజనేయ స్వామి భారీ విగ్రహం వద్ద నుండి కేస్లాపూర్ ప్రధాన ఆలయం వరకు పూర్ణ కళశంతో శోభయాత్రను నిర్వహించి, సాయంత్రం 5:15 గంటలకు శమీ వృక్ష పూజ సాంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించనున్న రావణ దహన కార్యక్రమానికి లక్కీ డ్రా ద్వారా శ్రీరాముని ఎంపిక చేసే కార్యక్రమం నిర్వహిస్తారు. వేడుకలకు జిల్లా కేంద్రంతోపాటు చుట్టూ మండలాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చే అవకాశం ఉండడంతో కలెక్టర్ ప్రజా ప్రతినిధులు పాల్గొననున్న నేపథ్యంలో పోలీసులు కూడా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయం విద్యుత్ కాంతులతో వెలిగిపోతుంది. ఆలయ ఆవరణలో నేడు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## నేడే 68వ ధమ్మచక్ర పరివర్తన దివస్

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శనివారం 68వ దమ్మచక్ర పరివర్తన దివస్‌ను నిర్వహించనున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు ఉప్రే జయరాం తెలిపారు. ఇందులో భాగంగా మండలకేంద్రంలోని జశ్వంత్ బుద్ధ విహార్ కేంద్రంలో ఉదయం పంచశీల జెండా ఆవిష్కరణ, జెండా వందనం, సాయంత్రం ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, అంబేద్కర్ సంఘం నాయకులు, సిద్ధార్థ యువజన సంఘం నాయకులు, మాతృశ్రీ రమాబాయ్ మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘం ప్రతినిధి విలాస్ కోరారు.

## అడ్డదారి గుండా అక్రమ రవాణా

- మార్కెట్ ఆదాయానికి గండి

నవతెలంగాణ-మద్నూర్

ప్రస్తుతం సోయా పంట చేతికి వచ్చింది. ప్రైవేట్ వ్యాపారాలు పల్లెటూరులో జోరుగా కొనసాగిస్తున్నారు. సర్కారు మద్దతు ధర కంటే ఐదారు వందలు తక్కువ ధరతో కొనడమే కాకుండా మార్కెట్‌కు కట్టవలసిన పన్ను కట్టకుండా కొనుగోలు చేసిన పంటను అడ్డదారి గుండా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. మద్నూర్ మార్కెట్ కమిటీకి రావలసిన ఆదాయం రాకుండా గండి పడుతుంది. అడ్డదారుల గుండా వెళ్లే వాహనాల పట్ల అధికారులు పట్టించుకోవడంలేదు. పల్లెటూరులో కొనసాగుతున్న వ్యాపారాలపై నిగా పెట్టడంలేదు. ధరల తగ్గుదలతో రైతులకు మోసాలు అంటే కొనుగోలు చేసిన మాలుకు మార్కెట్ ఫీజు చెల్లించకుండా అడ్డదారుల గుండా మహారాష్ట్రకు తరలిస్తూ మార్కెట్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఉమ్మడి మండలంలో మద్నూర్, డోంగ్లి ఇరు మండలాల పరిధిలో దాదాపు సోయా పంట సాగు ముప్పై వేల ఎకరాల పైన సాగు అయింది. పంట దిగుబడి అంచనాల ప్రకారం ఎకరానికి 8, 9, క్వింటాళ్ల పంట వస్తున్నట్టు రైతుల్లో వినబడుతున్న చర్చలు దాదాపు మద్నూర్ ఉమ్మడి మండలంలో రెండున్నర లక్షల క్వింటాళ్ల సోయా పంట దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు రూ.4 వేల నుంచి రూ.4,300 వరకు కొనుగోలు జరుపుతున్నారు. ప్రైవేట్ అంచనాల ప్రకారం క్వింటాలుకు మార్కెట్ ఫీజు రూ.40 చెల్లించవలసి ఉంటుంది. లక్షలకి క్వింటాళ్లు దిగుబడి వచ్చే సోయా పంటకు ప్రైవేటు వ్యాపారులు మార్కెట్ ఫీజు తప్పించేందుకు అడ్డదారుల గుండా వాహనాలను తరలిస్తున్నారు. మార్కెట్ ఫీజు ఎగ్గొడుతూ అడ్డదారుల గుండా వెళ్లే సరుకు వాహనాల పట్ల మార్కెట్ కమిటీ అధికారులు నిఘా పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

## పద్మాజివాడి వాసికి ఎస్జీటీ పోస్టు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజి వాడి గ్రామనికి చెందిన తీగల ప్రదీప్‌గౌడ్‌కు ఎస్జిటి పోస్టుకు ఎంపికయినట్టు తెలిపారు. ఆయన తండ్రి గీత కార్మికులు తీగల ఎల్లాగౌడ్, మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆయనకు స్నేహితులు, గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మా ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వండి



నవతెలంగాణ- సిర్పూర్(టి)

వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన సిర్పూర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో డాక్టర్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు లేక వసతులు కొరవడి ప్రయివేటు వైద్యం చేయించుకోలేక పేదలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్, నేడు డిజిటల్ వ్యవస్థ నడుస్తున్నప్పటికీ డిజిటల్ ఎక్స్‌రే సదుపాయం లేదని తెలిపారు. మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్రకు పోవాల్సిన పరిస్థితి ఉందని సీఎం, వైద్యారోగ్య శాఖ మంత్రి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ ప్రాంత ప్రజలకు మీ గ్యారంటీలు వద్దు ముందు ప్రజల ఆరోగ్యాల గురించి వారి ప్రాణాల గురించి పట్టించుకోవాలని హితవు పలికారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే హరీష్‌బాబు నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోవాలని, మీ ప్రజా లైఫ్ ఆస్పత్రిని చక్కగా, తీర్చిదిద్దుకుంటున్నారని, ప్రభుత్వ ఆస్పత్రులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసి పార్టీ సభ్యత్వం మీద దృష్టి పెట్టడం సరికాదన్నారు. ఇన్ పేషెంట్ వార్డులో ఒక్క పేషంట్ లేక బెడ్లు పూర్తిగా చెడిపోయి వాటిపై ఒక బెడ్ షీట్ కూడా వేసే పరిస్థితి లేదన్నారు. ఆపరేషన్ థియేటర్ ఉన్నా కూడా నిరుపయోగంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండు గురె శ్యామ్ రావు, సిర్పూర్ మండల కన్వీనర్ అస్లాంబిన్ అబ్దుల్లా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా, లలిత, దాసరి నరేందర్ భరత్, వికాస్ పాల్గొన్నారు.

# సింగరేణిని అభివృద్ధి బాటలో నిలపాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థను అభివృద్ధి బాటలో నిలిపేందుకు తమ కుటుంబం ముందుంటుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా గోలేటి జీటీసీఓప ( ఆఫీసర్స్ క్లబ్)లో ఏర్పాటు చేసిన ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం గార్ల ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా చేపట్టిన ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర కార్యక్రమం ఉద్యోగుల్లో చైతన్యాన్ని కలిగిస్తుందన్నారు. నష్టాల్లో ఉన్న సింగరేణిని కాపాడిన ఘనత కాకా వెంకటస్వామి గారిదని కొనియాడారు. ఇప్పటికి తమ కుటుంబం సింగరేణి ఉద్యోగులు, సంస్థ పురోగతి కోసం కృషి చేస్తుందన్నారు. పెర్క్స్ అలవెన్స్‌పై ఉద్యోగులకు



ఆదాయపన్ను లేకుండా కేంద్రంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. బెల్లంపల్లి ఏరియాలో త్వరలో రాబోయే గనుల విషయంలో తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ప్రతి ఉద్యోగి సంస్థ నాది అనుకుని పని చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగులకు ఏర్పాటు చేసిన విందు లో పాల్గొన్నారు. అంతకు ముందు మల్టీ డిపార్ట్మెంటల్ కమిటి అధికారులతో కలిసి జీఎం ఎం శ్రీనివాస్ సింగరేణి సమగ్ర ప్రగతిపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్ఓ టూ జీఎం కె రాజమల్లు, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, ఫైనాన్స్ మేనేజర్ మామిడి రవికుమార్, పర్సనల్ మేనేజర్ ఆర్ తిరుపతి పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

- అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో కూడా మంచి ప్రదర్శన చేయాలని అడిషనల్ ఎస్పీ ఆర్.ప్రభాకర్‌రావు అన్నారు. జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు సిబ్బందిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా ఈనెల 14 నుంచి 18 వరకు టీజీపీఏలో నిర్వహిస్తున్న పోలీస్ డ్యూటీ మీట్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచాలన్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు విధుల్లో నూతనత్వాన్ని కనబరిచే విధంగా చేయడానికి ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిలో పరిశోధన శాస్త్రీయ దర్యాప్తు విభాగంలో వాంకిడి ఎస్ఐ ఎం ప్రశాంత్, ఆసిఫాబాద్ డబ్ల్యూపిసి రూకియా సుల్తానా, కెరమెరి కానిస్టేబుల్ శ్రీనివాస్ ఉన్నారు. డాగ్ స్క్వాడ్ నార్కోటిక్ పదార్థాల తనిఖీ విభాగంలో ఎన్.రోహిత్ ఏఆర్‌హెడ్ క్వార్టర్స్ కానిస్టేబుల్, ఫోటోగ్రఫీ విభాగంలో టి.వెంకటస్వామి, వీడియోగ్రఫీ విభాగంలో కూడా వెంకటస్వామి ఎంపికయ్యారు.

# సుల్తాన్‌గూడలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని సుల్తాన్‌గూడ మసీదు వాడాలో సుమారు 85 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ వీధిలో మూడు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడుతోంది. దీంతో రాత్రి పూట విద్యుత్ సరఫరాలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరచూ 15నిమిషాలకు ఒకసారి ట్రిప్ అవుతోంది. సంబంధిత లైన్‌మెన్ సరి చేసినా తరుచు అంతరాయం కలుగుతోంది. వీధి దీపాలను ఆఫ్ చేయగా విద్యుత్ సరఫరా అవుతుంది. వీధి దీపాలను ఆఫ్ చేస్తుండడంతో రాత్రుల్లో అంధకారం ఏర్పడుతోంది. రాత్రి సమయాల్లో విషపూరిత కీటకాలతో ప్రమాదం పొంచి ఉంది. గురువారం ఎస్సీ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సమయంలో చిన్నారి సుదీక్ష తేలు కాటుకు గురైంది. ఆసుపత్రికి తరలించడంతో ప్రమాదం తప్పింది. ఈ వీధిలో 15 డిటిఆర్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా అధిక లోడ్‌తో విద్యుత్ అంతరాయం కలుగుతోందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు.



విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన ప్రతిసారి స్థానిక యువకులు కర్రతో ప్రయతించడం పరిపాటిగా మారింది. 15 డిటిఆర్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న స్థానంలో 25 డిటిఆర్ ఏర్పాటు చేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ సుజాయిత్‌ఖాన్ గత నెల రోజుల నుండి సబ్ ఇంజనీర్, ఏఈని చరవాణిలో సంప్రదించగా 15రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

నవతెలంగాణ- కామారెడ్డి

నూతన ఉపాధ్యాయులకు టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ వృత్తిలోకి ఆహ్వానించి స్వాగతం నపలికారని టీపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనిల్ కుమార్ తెలిపారు. డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేసిన వారిని టిపిటి ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కలిసి వారికి అభినందనలు, స్వాగతం తెలియజేశారు. టిపిటి ఎఫ్ అధికార మాసపత్రిక, కరపత్రాలను అందించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మీ వంతుగా కృషి చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా ఉపాధ్యాయులను నియామకాలు చేసినందుకు ప్రభుత్వానికి జిల్లా శాఖ పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. త్వరలోనే పాఠశాలలను కేటాయించాలని ప్రభుత్వానికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ నాగభూషణం, జిల్లా కార్యదర్శి సిహెచ్ లింగం, సిహెచ్ లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు నలినీ దేవి, టి.శ్రీనివాస్, రూప్‌సింగ్, గోపి, శ్రీనివాస్, ప్రకాష్, నరేందర్, నారాయణ, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వరద సాయం నిధులు మంజూరు



నవతెలంగాణ-బెజ్జూర్

భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్సీ దండె విఠల్ శుక్రవారం తెలిపారు. జిల్లాకు రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేయిస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు త్వరలో చేపడతామన్నారు. అనంతరం వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హర్షద్ హుస్సేన్, రాచకొండ శ్రీవర్ధన్, సామల రాజన్న సురేష్‌గౌడ్, రేణిగుంట్ల పెంటయ్య, పంద్రం పుష్పలత, ఫసివుల్లాఖాన్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

## పెంచికల్‌పేట్ రోడ్డుకు మరమ్మత్తులు



నవతెలంగాణ-బెజ్జూర్

సలగుపల్లి నుండి పెంచికల్‌పేట్ ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రోడ్డును పరిశీలించి కార్యకర్తలు, ప్రజల అభీష్ట మేరకు గుంతలమైన రోడ్డును మట్టితో పూడ్చారు. ఎప్పటికీ ప్రజల్లో ఉండి ప్రజల ఇబ్బందులను తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి దసరాకు ముందు రోడ్లు మరమ్మతులు చేసే వారమన్నారు. పెంచికల్‌పేట్ రోడ్డు పూర్తిగా గుంతలమయమై ఇబ్బందులు పడుతున్నామని, ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో గుంతలు పూడ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బషరత్ ఖాన్, పుల్లూరి సతీష్, జావిద్ అలీ, నగునూరి శ్రీనివాస్, గంగర ఇస్తారి, శ్రీనివాస్, అమీరుద్దీన్ పాల్గొన్నారు.

## దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గాదేవి స్వయంభూ శ్రీ మహంకాళీ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని తొమ్మిదవ రోజు మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చింది. పక్క జిల్లా నుంచి రాష్ట్రాల నుండి వేలాది భక్తులు వచ్చి అమ్మవారి దర్శించుకున్నారు. ఒడి బియ్యం పట్టు వస్త్రాలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్, అర్చకులు పూసాల మహేష్ శాస్త్రి ఆధ్వర్యంలో మహ చండీయాగం నిర్వహించారు. విజయదశమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వాహన పూజలు నిర్వహించబడతాయని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారి పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. పూజ అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మోడం తిరుపతిగౌడ్, మధు, గంగాధర్, ఉదయ్, సాయి కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రాగి దొంగతం

సిర్పూర్(టి) : హుర్కిలి ఎత్తిపోతల పథకంలోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన రాగిణి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్టు లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ ఎంఏ రషీద్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలో సుమారు 1200 ఎకరాలకు నీరు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.4.50 కోట్లతో దీనిని నిర్మించింది. ఈ లిఫ్ట్ కింద హుడుకులి, జక్కాపూర్, నవేగం, దుబ్బగూడా సిర్పూర్ గ్రామాల రైతులకు నీరు అందుతుంది. గత నాలుగు నెలలుగా వర్షాకాలం వలన దీని ఉపయోగించలేదని, నీటి విడుదల చేసే ఆపరేటర్ మోటరు ఆన్ చేసిన సప్లై రాకపోవడం గమనించి కరెంటు సిబ్బందికి తెలియజేశాడు. వారు వచ్చి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ల రాగిని దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పంటలు చేతికొచ్చే దశలో ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురి కావడం వల్ల రైతులు చాలా నష్టపోతారని, ఇదేవిధంగా గతంలో రెండుసార్లు దొంగతనం జరిగిందని ఆయన అన్నారు.

## హెచ్ఎంఎస్ కృషితోనే ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లింపు

• రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లింపు హెచ్ఎంఎస్ కృషి ఫలితమేనని రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ అన్నారు. సింగరేణి సీఎండీతో పాటు డైరెక్టర్ ఫాను కలిసి వినతీ పత్రం అందజేశారు. అదేవిధంగా జైపూర్ ఎస్టీపీపీ ఎగ్జిగ్యూటీవ్ డైరెక్టర్ రాజశేఖర్ రావును కలిసి వినతీ పత్రం ఇవ్వడంతో యాజమాన్యం స్పందించి జైపూర్ ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులకు రూ.5 వేల బోనస్ చెల్లించిందని తెలిపారు. కాగా కాంట్రాక్టు కార్మికులకు డస్ట్ అలవెన్స్ ఎన్టీపీసీ మాదిరిగా ఇవ్వాలన్న డిమాండ్ కూడా త్వరలోనే నెరవేరబోతుందని, సింగరేణి యాజమాన్యం యూనియన్ల ఆధ్వర్యంలో చర్చలు జరుపుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ కొలువు సాధించిన పశువుల కాపరి కొడుకు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మొర్రిగూడ గ్రామానికి చెందిన పశువుల కాపరి సంతపురి చిన్న మల్లవ్వ కుమారుడు అశోక్ ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు. అశోక్ తండ్రి తన చిన్నతనంలోనే మృతి చెందడంతో పట్టుదలతో చదివి జీవ శాస్త్రంలో మంచిర్యాలలో 21వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించాడు. ఆ పేద కుటుంబం నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తనను మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ మాదాడి సర్వజన రవీందర్రావు, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ఎంపీటీసీల పురం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, గుర్రం మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పసియుల్లా, నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్ అభినందించారు.

## ఉపవాస దీక్ష విరమణకు పటిష్ట బందోబస్తు

• రామగుండం సీపీ ఎం శ్రీనివాస్



నవతెలంగాణ-కాసిపేట

కల్వరీ చర్చ్ ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట స్టేషన్ పరిధిలోని కల్వరీ చర్చి ఆధ్వర్యంలో ఈ నెల 16, 17వ తేదీల్లో పాస్టర్ ప్రవీణ్ 50 రోజుల ఉపవాస దీక్షకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సుమారు ఒక లక్ష యాభై వేల మందికి పైగా పాల్గొననున్న నేపథ్యంలో ఏసీపీ మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి భద్రత ఏర్పాట్లు, ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ స్థలాలు, వీవీఐపీ పార్కింగ్ స్థలాలు, భోజన ఏర్పాటు స్థలాలు, సభ వేదికలను సందర్శించి భద్రత పరమైన ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు ఒక లక్ష 50 వేల పైగా భక్తులు, ప్రజలు పలు ప్రాంతాల నుండి ప్రార్థనలకు, సభకు వచ్చే వాహనాలకు, ప్రజలకు, సాధారణ వాహనదారులకు ఎటువంటి ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా సభకు వచ్చే మార్గాలపై చర్చించారు. పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఆర్ఐ వామన మూర్తి, కాసిపేట్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## సంస్థ గురించి ప్రతి ఒక్క ఉద్యోగి తెలుసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థ గురించి ప్రతి ఒక్క ఉద్యోగి తెలుసుకోవడం ముఖ్యమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని జీఎం కార్యాలయంలో, ఆర్కే-6,7, ఎస్ఆర్పీ-3, డిస్పెన్సరీ, ఎస్ అండ్ పీసీ, సివిల్, సీహెచ్పీలలో ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి భవిష్యత్తు ప్రతి ఒక్కరి పైన ఆధారపడి ఉందని, దానిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉంటుందని తెలిపారు. అనంతరం ఉద్యోగులతో సింగరేణి సంస్థ స్థితిగతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఏజీఎం సివిల్ క్వాలిటీ నవీన్, ఏజెంట్లు గోపాల్ సింగ్, శ్రీధర్, డీజీఎం సీహెచ్పీ చంద్రలింగం, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్‌బాబు, ఆర్కే-6,7, ఎస్ఆర్పీ-3 మేనేజర్లు ఇ. తిరుపతి, వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఇసుక రీచ్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-జైపూర్

కోటపల్లి మండలం కొల్లూరు ఇసుక రీచ్‌ను శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల అవసరాలు, సౌకర్యం దృష్టితో జిల్లా పరిధిలో ఇసుక రీచులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ముందస్తుగా వెబ్‌సైట్‌లో బుక్ చేసుకున్న తర్వాత ఇసుకను తరలించాలని సూచించారు. బుక్ చేసుకోకుండా ఎవరైన అక్రమంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నూతన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇటీవల ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలానికి చెందిన పలువురిని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యాభివృద్ధి కోసం నూతన ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకరి పెంటు, గాజుల రాజేంద్ర ప్రసాద్, ఏకారి కార్తీక్, లింగమూర్తి పాల్గొన్నారు.



# భవిష్యత్ భద్రతపై దృష్టి సారించాలి

• చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

కాలానుగుణంగా సరైన నిర్ణయాలతో భవిష్యత్ బద్రతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర అనే కార్యక్రమంలో శుక్రవారం విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా సింగరేణి యాజమాన్యం ఇతర రంగాల్లో రాణిస్తోందని అన్నారు. థర్మల్ విద్యుత్‌తో పాటు సోలార్, ఫ్లోటింగ్ రంగాల్లో అడుగుపెట్టన సింగరేణి భవిష్యత్ బద్రత వైపు అడుగులు వేస్తోందని అన్నారు. స్థానిక నిరుద్యోగులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. సింగరేణి చరిత్రలో కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ఇవ్వడం ఇదే మొదటి సారి అని అన్నారు. సింగరేణి సంస్థ మన కుటుంబంలో ఒక తల్లిలాగ మనందరిని కాపాడుతుందని అభిప్రాయపడ్డారు..

**కంపెనీ బాగుంటే కార్మికులు బాగుంటారు..**

కంపెనీ బాగున్నప్పుడు కార్మికులు బాగుంటారని వారి భవిష్యత్ బాగుంటుందని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. కంపెనీ అభివృద్ధి ఎంత ముఖ్యమో కార్మికుల సంక్షేమం అంతే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా కోలిండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేసి వారి పనికి తగిన వేతనాన్ని కల్పించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇక్కడ పవర్ ప్లాంట్ ఏర్పడితే ఇక్కడి వారందరికి ఉద్యోగాలు వస్తాయని ఆశించారని విలువైన వ్యవసాయ భూములను ప్లాంట్ ఏర్పాటుకు సమకూర్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ క్రమంలో ప్లాంట్ పరిధిలో 80 శాతం ఉద్యోగాలు భూ నిర్వాసిత కుటుంబాలకు స్థానికులకు ఇవ్వాలని అన్నారు. అంతేకాకుండా రాబోవు రోజుల్లో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ద్వార స్థానికులకు అవకాశం కల్పించాలని అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచి నిర్వాసిత గ్రామాల యువకులకు నైపుణ్య శిక్షణ కోసం ఎంపిక చేసి వారికి సరైన శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

**సింగరేణిలో మాత్రమే పెన్షన్ వస్తోంది..**

ప్రభుత్వ రంగ సంస్థల్లో సింగరేణి మినహా ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎక్కడ కూడా విశ్రాంత కార్మికులకు పెన్షన్ చెల్లించడం లేదని కేవలం సింగరేణిలో మాత్రమే పెన్షన్ చెల్లింపు కొనసాగుతుందని ఎస్టీపీపీ ఎగ్జిగ్యూటీవ్ డైరెక్టర్ రాజశేఖర్ రావు అన్నారు. సింగరేణిలో పెన్షన్ విధానం వచ్చిందంటే అది కేవలం పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి కృషి, పట్టుదల మాత్రమే అన్నారు. సింగరేణి సంస్థ సాధించిన లాభాల వాటను కార్మికులకు అందజేయడంతో పాటు సంస్థ స్థితిగతులను కార్మికుల ముందు వివరిస్తూ సంస్థ భవిష్యత్ కోసం ఎలాంటి ప్రణాళికలు తయారు చేసుకోవాలనే విషయమై ఈ రోజు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. అదేవిధంగా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ మంచి పని తీరు కనబర్చుతూ సంస్థ లాభాలలో భాగాన్ని అందిస్తుందని అన్నారు. గడిచిన 3 సంవత్సరాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ పవర్ జనరేషన్ యూనిట్‌గా అవార్డులు అందుకుంటుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

భారతదేశం భిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమని, తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాల్లో మార్పులు రాకూడదని, బతుకమ్మ వేడుకలలో డీజేలకు స్వస్తి పలికి పాత విధానాలను అవలంబించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు సైతం సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోయి పాశాత్య సంస్కృతి సంప్రదాయాలకు అవలంభించడం సరైనది కాదని, రాబోయే రోజుల్లో సంస్కృతి సంప్రదాయాలు కాలగర్భంలో కలిసిపోతాయని, దీన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం మహిళలతో కలిసి నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్ మేకల మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, సుభాష్‌రెడ్డి, ఇసాక్, మత్స్య శంకరయ్య, మహ్మద్ రియాజుద్దీన్, మామిడిపల్లి ఇందయ్య, దుమల రమేష్, ప్రశాంత్ ప్రవీణ్, పసియుల్లా, పంకజా సుధాకర్ నాయక్, లక్ష్మీ నందు నాయక్, అల్లం వెంకటరాజం, రాజన్న, గంగన్న, జీఎస్ నారాయణ పాల్గొన్నారు.

# కాంగ్రెస్, సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు

• సీఎం రేవంత్‌తో పాటు మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు బోనస్ రూ.5 వేలు పంపిణీ చేసిన కాంగ్రెస్‌తో పాటు సింగరేణి యాజమాన్యానికి ఐఎన్‌టీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులతో కలిసి ఐఎన్‌టీయూసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఎస్టీపీపీ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు పేరం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటి సారిగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించడం హర్షనీయమని అన్నారు. సింగరేణి పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు రూ. 5 వేల చొప్పున కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన సింగరేణి యాజమాన్యానికి ఈ సంధర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు రామగిరి మల్లేష్, ఎల్క రమేష్, నరెడ్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి తొగరి కృష్ణ, సంయుక్త కార్యదర్శి చిప్ప లింగయ్య, బండి శ్రీనివాస్, ముఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి జనంపల్లి శ్రావన్ కుమార్, కార్యనిర్వాహఖ కార్యదర్శులు మద్దుల రాజిరెడ్డి, గడ్డం శివ, కోశాధికారి గోనె నరేష్, ప్రచార కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పూలను పూజించే పండగ బతుకమ్మ

నవతెలంగాణ-జన్నారం



పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించి, పసుపు ముద్దను చేసి, నిండు మనస్సుతో గౌరమ్మను కొలిచే నిండైన వేడుక మన బతుకమ్మ పండుగ అని ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొని ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. కనీసం పండగ పూట మహిళలకు బతుకమ్మ చీరలు కూడా ఇవ్వకుండా మహిళా వ్యతిరేక ప్రభుత్వంగా ముద్ర వేసుకుందని అన్నారు. మహిళలు ప్రజలు ఇప్పటికైనా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం రాజారామ్‌రెడ్డి, జనార్దన్ మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ మేజర్ సర్పంచి జక్కు భూమేష్, జిల్లా నాయకులు భరత్ కుమార్, ఫజల్ ఖాన్ మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, నర్సాగౌడ్, కేప నరసింహులు, జనగామ సంతోష్, జంగం రవి, మండల యూత్ అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సృజన్ కలీం, పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వార అమలు చేస్తున్న పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు కుందారం శాఖ మేనేజర్ రాకేష్ కుమార్ అన్నారు.. కుందారం గ్రామంలో శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సౌజన్యంతో ఆ బ్యాంకు ఖాతా దారులకు అవగాహన కల్పించారు. నగదు పొదుపుతో పాటు బ్యాంకు వారు పంపిణీ చేస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అదే విధంగా బ్యాంకు ద్వార అమలు చేస్తున్న వ్యక్తిగత భీమా పథకాలపై గ్రామస్థులకు అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీ రూలర్స్‌వోక్స్ ఆర్గనైజర్ బృందం వారి మ్యాజిక్ షో ద్వారా బ్యాంకు సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో కుందారం బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్ కుమార్, నరేష్ కుమార్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు..

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి



నవతెలంగాణ-దండేపల్లి

క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్ అన్నారు. దసరా సెలవులను పురస్కరించుకొని మండలంలోని తాళ్లపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పది రోజుల పాటు వాలీబాల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా వారు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉన్నత లక్ష్యంతో నేర్పించిన అంశాలను విద్యార్థులు నిరంతరం సాధన చేయాలని సూచించారు. దసరా సెలవుల్లో కూడా విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఎండీ ముస్తఫా, మండల గల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు సందల మల్లేష్, వాలీబాల్ కోచ్ బోడకుంట మహేష్, స్థానిక నాయకులు రాజు, రమేష్ నిర్వాహకులు మహేష్ పాల్గొన్నారు.

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..!



నవతెలంగాణ-జైపూర్

ఆపద సమయంలో అధైర్య పడొద్దు.. బాల్య స్నేహితులమైన మేము మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. సముద్రాల రాజు అనే బాల్య స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెల్సుకున్న జైపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల 2002-2003 బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం ఆయన్ను కలిసి పరమార్శించారు. వారు ఏర్పాటు చేసుకున్న అమిగోస్ వెల్ఫేర్ అసోసియేషన్ ట్రస్ట్ ద్వారా రూ.30 వేలు ఆర్థిక సహాయాన్ని తమ స్నేహితునికి అందజేశారు. ఈ సంధర్భంగా సముద్రాల రాజు కుటుంబ సభ్యులతో మాట్లాడి భవిష్యత్తుల్లో కూడా అమిగోస్ వెల్ఫేర్ అసోసియేషన్ ట్రస్టు మీ కుటుంబానికి అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు. కాగా తాము ఏర్పాటు చేసుకున్న అమిగోస్ వెల్ఫేర్ అసోసియేషన్ ట్రస్ట్ ద్వారా తమ వారిలో ఎవరికైనా ఏ ఆపద వచ్చినా, అవసరం ఏర్పడినా సహకరించుకోవడం కోసం ఈ ట్రస్టును ఏర్పాటు చేసుకున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

## మహిషాసుర మర్దినిగా దర్శనమిస్తూ పూజలు అందుకున్న దుర్గామాత



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఇటిక్యాల శ్రీ ప్రసన్న లక్ష్మీనర సింహ ఆలయ ప్రాంగణంలో నవరాత్రి ఉత్సవంలో భాగంగా ప్రతిష్టమైన దుర్గామాతకు శ్రీ మహిషాసుర మర్దినిగా దర్శనమిస్తూ దుర్గాదేవి పూజలు అందుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వేద పండితులు గొల్లపల్లి శ్రీధర్, ఆచార్యులు గొల్లపల్లి రామానంద ఆచార్య, పురోహితులు కట్ట అశోక్ చార్య, గొల్లపల్లి నరసింహాచార్య, సమరసింహాచార్య, విజయసింహ చార్య, నూతి వెంకటాచార్యులు, అమ్మవారిదీక్ష భక్తులు, అధిక సంఖ్యలో భక్తజనులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-ఇచ్చోడ



గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో ఆయన హైదరాబాద్‌లో సీఎం చేతుల మీద నియామక పత్రం అందుకున్నారు. కాగా శుక్రవారం ఆయన పనిచేస్తున్న వాఘాపూర్ గ్రామపంచాయతీ సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న స్థాయి నుంచి ఉన్నతమైన స్థానంలో చేరాలి అంటే చదువు ఒకటే మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది అశోక్, గజానంద్, గంగన్న, భూమయ్య పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదని, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని భాగ్యనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్మల్ పట్టణం, సారంగపూర్, లక్ష్మణచాంద, సోన్, మామడ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొంది, ఆర్థిక భారం భరించలేక, సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న 38 మంది లబ్ధిదారులకు రూ.20లక్షల అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాందేడాపు చిన్నూ, సారంగపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ హదీ, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, నాయకులు అప్పాల ప్రభాకర్ , వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు ఉన్నారు.

## సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోయ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కౌట్ల(బి) సొసైటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన సోయలు కొనుగోలు కేంద్రానికి తెచ్చి విక్రయించి, క్వింటాలుకు రూ. 4,892 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి చైర్మెన్ నారాయణరెడ్డి, మార్కెట్ కార్యదర్శి సొసైటీ సీఈఓ సలీం, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## ఏపీఎంలకు సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో ఐకేపీ ఏపీఎంగా పనిచేసి బదిలీపై వెళ్తున్న స్వామిని, కొత్తగా బదిలీపై వచ్చిన ఏపీఎం చంద్రశేఖర్‌లను శుక్రవారం ఐకేపీ భవనంలో మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీడీఓ శేఖర్, మండల వసుంధర సమైక్య అధ్యక్షురాలు ప్రేమల ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీడీఓ శేఖర్ మాట్లాడారు. ఉద్యోగస్తులకు బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణలు సర్వసాధారణం అయినప్పటికీ ప్రజలకు ఎంత సేవ చేసాం అనేది ముఖ్యమని తెలిపారు. ఏపీఎం స్వామి మండల ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళలకు సకాలంలో రుణాలు అందించిన ఘనత ఉందన్నారు. మండలంలో 740 ఎస్ఎస్‌జీ గ్రూపులకు సేవలు అందించి, బదిలీపై జిల్లా కేంద్రానికి వెళుతున్నందున మరిన్ని సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పెందుర్తి సోంబాయి, కోశాధికారి ఎస్‌కే రజియా బేగం, ఆదిలాబాద్ ఏపీఎం సిద్ధోధన్, కాంగ్రెస్ నాయకులు పోశెట్టి, గంగన్న, కమలాకర్, ఐకేపీ సిబ్బంది భీంరావు, బాపూరావు, రమేష్, ఆనంద్‌రెడ్డి, ఆశన్న, కాడే రామన్న, నల్ల రాంరెడ్డి పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్ నుంచి ఉపాధ్యాయురాలిగా..

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఎన్నో ఏండ్ల కల.. సాధనలో ఎన్నో ఒడుదొడుకులు చూస్తూ కుటుంబ బాధ్యతలు, రాజకీయం కష్టనష్టాలను చూస్తూ కష్టపడి చదవడంతో నేడు కల సాకారమైన వేళ తమ కష్టాన్ని కూడా మరిచిపోయారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామ ఉప సర్పంచ్‌గా పనిచేసిన సాగరిక ఎలాంటి కోచింగ్ లేకుండా బాన్సువాడ లైబ్రరీలో చదువుకుంటూ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. ఎంతో మంది నిరుద్యోగులు పెళ్లయిన మహిళలు ఇక నాతో అని ఏమవుతుందిలే అనే మహిళలు ఎలాంటి కోచింగ్ లేకుండా ప్రభుత్వ గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదివి డీఎస్సి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు నెమ్లి గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు. అలాగే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ కాసుల బాలరాజ్ ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ సభ్యుల సహకారం, కృషితో ఈ డీఎస్సీ లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం సాధించానని అన్నారు.

## ఒకే ఏడాదిలో రెండు కొలువులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కిరణ్ సతీమణి స్వర్ణలతకు ఒకే సంవత్సరంలో రెండు 2 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా అభినందించారు. ఈ ఏడాది మార్చ్‌లో గురుకుల మ్యాథమెటిక్స్ టిజిటి, ఇటీవలి డీఎస్సీ ఫలితాలలో ఎస్జిటి ఉద్యోగాలు సాధించిందని, ఆమె ప్రతిభతో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. మండలంలో బిక్కనూరులో సంఘం మండల అధ్యక్షులు అమృతరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామ అధ్యక్షులుగా బేగరి మైసయ్య, ఉపాధ్యక్షులు సుమంత్, జి కిరణ్, కార్యదర్శి షేర్ పల్లి మహేందర్,కోశాధికారి విద్యాసాగర్, సలహాదారులుగా ఆంధ్రయ,రవి లను ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ బిట్ల సురేందర్, డివిజన్ అధ్యక్షులు మర్లు సాయిబాబా, ఉపాధ్యక్షులు సాయిలు, ప్రధాన కార్యదర్శి కే సాయిలు, గ్రామస్తులు శ్రీధర్, రమేష్, బన్నీ, అరవింద్, ఏప్రియం, వంశీ, దేవరాజ్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.80 కిలో బంతిపూలు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో బంతిపూలకు భలే గిరాకీ కొనసాగుతుంది. దసరా ఉత్సవాల్లో భాగంగా బంతిపూల అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. ప్రతి వాహనదారుడు పూల కోసం భలే గిరాకీ చేస్తున్నాడు. కిలో రూ.80 చొప్పున వ్యాపారులు బంతిపూలు అమ్ముతున్నారు. బంతిపూల ధర మామూలుగానే ఉన్నట్లు కొనుగోలుదారులు అంటున్నారు. ఎందుకంటే ఒకప్పుడు కిలో రూ.100 పైన కిలో చొప్పున పూలు అమ్ముతుండే. ప్రస్తుతం రూ.80 కిలో అమ్మడం సాధారణ ధరగా కొనుగోలుదారులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా బంతిపూలకు భలే గిరాకీ కొనసాగుతుంది.

# విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ప్రభుత్వం విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. చెన్నూరు మండలం సోమనపల్లిలో నిర్మించ తలపెట్టిన సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి వైపు దృష్టిసారించిన కాంగ్రెస్ ప్రభుత్వం సమీకత గురుకుల పాఠశాల నిర్మాణాలు చేపట్టిందని అన్నారు. ఈ క్రమంలో సోమనపల్లిలో నిర్మించ తలపెట్టిన సమీకృత గురుకుల పాఠశాల కోసం 25 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల వారికి సైతం విద్య వైద్యం అందుబాటులోకి తేవడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి చేపట్టడం జరిగిందని వసతుల కల్పన తాగు నీటి వసతి, మూత్రశాలలు వంట గదులు, ప్రహరి గోడల నిర్మాణం తదితర వసతులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పాఠశాల విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని అవసరమైన మేరకు ఉపాధ్యాయులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ గురుకుల పాఠశాల ద్వారా కుల మతాలు, వర్గ విభేదాలు లేకుండా అందరికీ సమానమైన విద్య అందుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని బయటకు వెళ్తున్న ప్రతి విద్యార్థిని బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్ది పంపడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించిన విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

# బతుకమ్మ వేడుకల్లో ఆత్రం సుగుణ



నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతికి నిదర్శనం బతుకమ్మ పండగ అని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని నాగాపూర్ గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు హాజరయ్యారు. దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, మహిళలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ బతుకమ్మ మన ప్రకృతి పండుగ అని, మనం ఎంత పెద్ద స్థాయిలో ఉన్న మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాబోయే తరాలకు మన పండుగలను, సంస్కృతిని అందించాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఇది మొదటి బతుకమ్మ అని, ఇకనుంచి ప్రతి పండుగను ప్రజలతో కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే



**దుర్గమాతను దర్శించుకున్న ఆడే గజేందర్ ...**

మండలంలోని కుమారి, బుగ్గారాం గ్రామాలలో దుర్గామాతలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన గజేందర్‌కి దుర్గా కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఆయన వెంట బోథ్ బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ప్రఫుల్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజురెడ్డి, మండల నాయకులు జనార్ధన్, సుదర్శన్, మధుకర్, మురళీగౌడ్, మందుల రమేష్, నారాయణగౌడ్, రమణ, చంద్రశేఖర్‌రెడ్డి, రాజుగౌడ్, రాజు యాదవ్, బ్రహ్మం, అగ్గు రమేష్, ప్రవీణ్, రోహిదాస్, రాజేష్, హెమ్యు నాయక్ పాల్గొన్నారు.



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బుగ్గారాం(బి) గ్రామంలోని దుర్గామాత మండపాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం తీజ్ ఉత్సవాల్లో పాల్గొని మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ భక్తి మార్గంలో నడువాలని ఆన్‌లైన్ కాలంలో కూడా చాలా గ్రామాల్లో పర్యటించినప్పుడు భక్తులు పెద్దఎత్తున హాజరై స్వాగతం పలుకుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, రాథోడ్ సురేందర్, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అభివృదే రాష్ట్ర అభివృద్ధి

- రైతుబాగుంటే.. మనం బాగుంటాం
- ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-జుక్కల్(మద్నూర్)

వ్యవసాయ అభివృదే రాష్ట్ర అభివృద్ధని ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. జుక్కల్ మండల కేంద్రంలో మద్దతు ధర సోయా పంట కొనుగోలు కేంద్రాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు శుక్రవారం ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతు బాగుంటేనే మనమందరం బాగుంటామని తెలిపారు. సోయా పంట మద్దతు ధర క్వింటాలుకు రూ.4892 ప్రకటించడం జరిగిందని తెలిపారు. రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. మనమందరం అన్నదాతకు అండగా ఉండి కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పంటకు సరైన మద్దతు ధర వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. రైతులకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో అయ్యప్ప గుడి నిర్మాణం కోసం భూమి పూజ చేశారు.

## ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్

నవతెలంగాణ-గాంధారి

ఇండ్లు లేని నిరుపేదలకు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధారి మండల కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేకమందికి పేదలకు ఇండ్లు లేవని ఇళ్లస్థలాలు ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో పేదప్రజలతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎకరాకు 7500 చొప్పున ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతు భరోసా జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరంగా పార్టీ గాంధారి శాఖను ఎన్నుకున్నారు. పార్టీ గాంధారి శాఖ కార్యదర్శిగా సరాఫ్ కిసాన్ రావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కమ్మరి సాయిలు, మధు, రాములు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 19న కుమురంభీం విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 19న మండలంలోని తాటిగూడ గ్రామంలో అమరజీవి కుమురంభీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ కోసం ఆదివాసుల హక్కులకు నిరంతరం పోరాడిన యోధుడు కుమురంభీం అని పేర్కొన్నారు. తాటిగూడ గ్రామంలో కుమురంభీం విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని, ఆదివాసులు పెద్దలు, అన్ని సంఘాలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం విగ్రహ నిర్వహణ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులకు భయపడేది లేదు




నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బీజేపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా వాపసు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు నమోదు చేసిన భయపడేది లేదన్నారు. మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని వారితో కలిసి నిరసన చేయడం తప్పేమీ కాదన్నారు. నిర్మలమైన నిర్మల్‌లో పారిశుధ్య కార్మికుల నిరసనతో పారిశుధ్యం లోపించడం చేత అన్ని వార్డులు దుర్గంధం అవడంతో బీజేపీ నాయకులు రంగంలోకి దిగి ఆయా ప్రాంతాలను శుభ్రం చేసి మున్సిపల్ అధికారులకు కండ్లు తెరిపించాలని చెత్తను మున్సిపల్ ఆఫీస్‌కు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ నిరసన కార్యక్రమం వల్ల ఎవరిని ఇబ్బంది పెట్టలేదని ఇలా చేయడం వల్లనే ముఖ్యమంత్రి ఆదేశంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమస్యను తాత్కాలికంగా పరిష్కారం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రామనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు రాచకొండ సాగర్, పట్టణ అధ్యక్షులు సాదం అరవింద్, బీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పొన్నం నారాయణగౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు నరేష్, అల్లం భాస్కర్, సీనియర్ నాయకులు పంతికే ప్రకాష్, బట్టు లింబాద్రి పాల్గొన్నారు.

## ముగిసిన బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-పిట్లం

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలలో భాగంగా గురువారము రాత్రి సద్దుల బతుకమ్మ నిమజ్జనాలతో బతుకమ్మ వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా పాత హనుమాన్ టెంపుల్ నుండి ఊర చెరువు వరకు అంగరంగ వైభవంగా విద్యుత్ దీపాలు అలంకరించగా ప్రముఖ వ్యాపారవేత్త సారిక సంతోష్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాటర్ బాటిళ్లు , చెరుకు రసం , చిన్నారులకు చాక్లెట్స్, అరటి పండ్లు పంపిణీ కార్యక్రమమును స్థానిక ఎమ్మెల్యే తోట అర్చన లక్ష్మీ కాంతారావు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి తోట అర్చన స్థానిక మహిళలతో బతుకమ్మ సంబరాలలో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో బొడ్ల శృతి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి , మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి దొర, శపథం రెడ్డి , సూరత్వంత్ రెడ్డి , మురళీధర్ , చిప్ప శివ , ఎన్ని గంటల శ్రీనివాస్ రెడ్డి , మాజీ సర్పంచ్ ఎరుకల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## పలుచోట్ల అన్నదానం

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం లోని పలు గ్రామాల్లో శుక్రవారం దుర్గమాత మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలం లోని అడ్లూర్ ఎల్లారెడ్డి లోని గ్రామ రైతు యువజన సంఘం, మోడెగాం గ్రామాల్లో అన్నదాన ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

## వీధి నాటకాలకు జీవం

- మైలారంలో అలరించిన ప్రదర్శన

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అంతరించి పోతున్న వీధి నాటకాలకు కొందరు కళాకారులు జీవం పోస్తున్నారు. నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మూడు రోజులుగా నిర్వహించిన ఎల్లమ్మ నాటక ప్రదర్శన శుక్రవారంతో ముగిసింది. ఎల్లమ్మ, పరశురాముని ప్రదర్శన ప్రజలను అమితంగా ఆకట్టుకుంది. మగవారు స్త్రీల వేషం వెయ్యడం, కళాకారులు పద్యాలు, పాటలు పాడడం అందరినీ అలరించింది. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా నాటకాలు ఉంటుండటంతో చాలా మంది వాటిని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు కళాకారులకు విరాళాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. నేటి సమాజంలో సెల్ ఫోన్లు, టీవీ, సినిమాలు, సీరియళ్లపై మక్కువ పెరగడంతో వీధి నాటకాలకు అంతకంతకు ఆదరణ తగ్గుతూ వస్తున్న నేపథ్యంలో ఇక్కడి నాటక ప్రదర్శన అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో దార వెంకటి, ముదెలి రాములు, కనుకుంట్ల మహేందర్, సాయిలు, చాకలి నాగయ్య, పోశెట్టి, బాలప్ప, కిష్టయ్య, భూమయ్య, మహేందర్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.